www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 26 ఏప్రిల్ 2025

5

ఏలూరు

7 నుండి 14 వరకు చిన వెంకన్న కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమల ఆలయంలో వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు మే 7వ తేదీ నుండి 14వ తేదీ వరకు జరగనున్నాయి. మే 7వ తేదీ స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడం, మే 8న ధ్వజారోహణం, మే 11న ఆదివారం రాత్రి 8 గంటల నుండి స్వామి వైశాఖమాస కళ్యాణోత్సవం, 12వ తేదీ సోమవారం రథోత్సవం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి తెలిపారు.



చదువు'కొన'లేం..!

ఒకటి నుంచి పదిలోపు ఏడాదికి రూ.20 వేల నుంచి రూ. లక్ష ఖర్చు

ఇంటర్ హాస్టల్ విద్యకు రూ. రెండు నుంచి రూ.2.50 లక్షలు

ఇంటర్ డేస్కాలర్ విద్యకు రూ.60 వేలు పెట్టాల్సిందే

ఇంజనీరింగ్‌కు ఏడాదికి రూ.లక్షన్నర నుంచి రూ.4 లక్షల భారం

బెంబేలెత్తిపోతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం

ప్రభుత్వ విద్యను బలహీనపరిచి.. ప్రయివేటు విద్యకు పెద్దపీట వేస్తున్న పాలకులు

సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి చదువు అందనంత ఎత్తుకు ఎగబాకింది. పోటీ ప్రపంచంలో ప్రతిభ కనబరచాలంటే చదువులో ఆది నుంచి గట్టి పునాది ఉంటే తప్ప సాధ్యం కాని పరిస్థితి. ప్రభుత్వ విద్యను బలహీనపరిచి, ప్రయివేటు విద్యకు పాలకులు పెద్దపీట వేస్తుండటంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లల చదువు కోసం అప్పల పాలై రోడ్డున పడుతున్న పరిస్థితి ఉంది.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వెయ్యికిపైగా ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లు ఉన్నాయి. వీటిలో రెండు లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. చిన్నపాటి ప్రయివేటు స్కూల్‌లో సైతం ఎల్‌కెజి, యుకెజి చదువులకు ఫీజులు, పుస్తకాలు, ఇతర ఖర్చుల పేరుతో రూ.పది వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఓ మోస్తరు స్కూల్ అయితే రూ.20 వేలు కట్టాల్సిందే. కార్పొరేట్ స్కూల్ అయితే రూ.30 వేలు పైమాటే. ఒకటో తరగతి నుంచి పదో తరగతిలోపు చదువుకు ప్రయివేటులో రూ.20 వేల నుంచి రూ.లక్ష ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. పుస్తకాలు, బెల్టులు, బూట్లు, అన్నీ ఆయా స్కూళ్లలోనే కొనుగోలు చేయాలనే నిబంధనలు విధించి దోపిడీ సాగిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ప్రయివేటు ఇంటర్ కాలేజీలు 81 వరకూ ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకి సంబంధించి 27 వేల మందికిపైగా విద్యార్థులు ప్రయివేటులో విద్య అభ్యసిస్తున్నారు. పశ్చిమలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇంటర్ హాస్టల్ విద్యకు శశి, తిరుమల, నారాయణ, శ్రీచైతన్య వంటి కాలేజీల్లో రూ.రెండు లక్షల నుంచి రూ.రెండున్నర లక్షలకుపైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇంటర్ డేస్కాలర్‌కు సైతం బస్సు ఫీజులతో కలిసి రూ.60 వేలు చెల్లించక తప్పదు. దీంతో పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. అప్పులు చేసి పిల్లలను చదివిస్తున్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రభుత్వ విద్యలో సరైన సదుపాయాలు లేకపోవడం, ప్రస్తుత పోటీని తట్టుకునే విధంగా విద్యావిధానం లేకపోవడంతో తమ పిల్లలు ఎక్కడ వెనుకబడిపోతారోనన్న భయం తల్లిదండ్రులను వెంటాడుతోంది. దీంతో తలకు మించిన భారమైనప్పటికీ ప్రయివేటు వైపు మొగ్గుచూపుతున్నారు. ఇదే అదనుగా ప్రయివేటు స్కూళ్ల యాజమాన్యాలు రెచ్చిపోతున్నాయి. ఫీజులకు సంబంధించిన వివరాల పట్టికలు వంటివి డిస్‌ప్లే చేయాల్సి ఉన్నప్పటికీ చేయడం లేదు. టీవీలు, పత్రికల్లో ప్రచారం చేస్తున్నదానికి, వాస్తవ పరిస్థితికి సంబంధం లేకుండాపోతోంది. ప్రయివేటు స్కూళ్లపై ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా యాజమాన్యాలు రెచ్చిపోతున్న పరిస్థితి ఉంది. ప్రయివేటు స్కూల్స్, కళాశాలల ఫీజులపై ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెనుభారంగా ఇంజనీరింగ్ విద్య

స్కూల్, ఇంటర్ విద్యతోపాటు, ఇంజనీరింగ్ విద్య మరింత పెనుభారంగా తల్లిదండ్రులకు మారింది. సాధారణ డిగ్రీలు చదివితే ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటంతో అంతా ఇంజనీరింగ్, వైద్య విద్య కోర్సుల వైపే ఎక్కువగా విద్యార్థులు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జెఎన్‌టియు, ఆంధ్రా యూనివర్సిటీ వంటి ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ ఉండే సీట్లు అతి స్వల్పంగా ఉన్నాయి. దీంతో ప్రయివేటు ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రయివేటు యూనివర్సిటీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఎంసెట్‌లో ర్యాంకు తెచ్చుకుంటే ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించినప్పటికీ ఏడాదికి కాలేజీని బట్టి హాస్టల్ ఫీజు రూ.80 వేల నుంచి రూ.లక్షా 50 వేలు, ఇతర ఖర్చుల కింద వ ం ం లో రూ.50 వేలు మొత్తం రూ లక్షన్నర నుంచి రూ.రెండు లక్షలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇక ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించకపోతే మరో రూ.లక్షకుపైగా అదనంగా కట్టాల్సిందే. విట్, ఎస్ఎంఆర్, కెఎల్‌యు వంటి యూనివర్సిటీలతోపాటు, వివిధ రాష్ట్రాల్లో ఉన్న యూనివర్సిటీల్లో చేరితే ట్యూషన్ ఫీజు కింద రూ.రెండున్నర లక్షలు, హాస్టల్ ఫీజు కింద రూ.లక్షా 40 వేల నుంచి రూ.రెండులక్షల వరకూ వసూలు చేస్తున్నారు. నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్య పూర్తయ్యేసరికి విద్యార్థికి అయ్యే ఖర్చు రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షలు వరకూ అవుతోంది. ఈ భారం సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం మోయలేని పరిస్థితి నెలకొంది. విద్య వ్యాపారంగా మారడంతో సామాన్య విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. ప్రభుత్వాలు మాత్రం నాణ్యమైన ప్రాథమిక, ఉన్నత విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైన పరిస్థితి ఉంది. దీంతో చదువు'కొన'లేం బాబోయ్ అంటూ జనం అదిరిపడుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యాలను సాధించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఉద్యాన, మైక్రోఇరిగేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాలవారీగా ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యాన, వ్యవసాయ, విస్తరణ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,80,814 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతుండగా అందులో 1,35,656 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 14 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌కు లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. దానికి అనుగుణంగా లక్ష్యాసాధనకు నెలవారీ మైక్రోప్లానింగ్ రూపొందించుకోవాలన్నారు. పంట వేసిన మొదటి నాలుగు సంవత్సరాల్లో ప్రభుత్వం కల్పించే రాయితీలను రైతులకు అవగాహన పర్చాలన్నారు. పొగాకు సాగుకు ప్రత్యమ్నాయంగా ఇతర ఉద్యాన పంటల సాగుపై రైతులను చైతన్యపర్చాలన్నారు. జిల్లాలో ఆహార ప్రాసెసింగ్ రంగంలో సూక్ష్మస్థాయి సంస్థలను ప్రోత్సహించేందుకు తొది దశలో 100 యూనిట్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. వివిధ మండలాల్లో మొక్కజొన్న, జీడిపప్పు ప్రాసెసింగ్, బనానా పౌడర్, వేరుశెనగ నూనె, మినీరైస్ మిల్లులు, కోకో బట్టర్ యూనిట్లు, తదితర యూనిట్ల ఏర్పాటుకు వ్యవసాయదారులను గుర్తించాలన్నారు. కొను గోలుదారులను గుర్తించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగులో డ్రోన్ వినియోగంపై వివిధ అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఉద్యాన శాఖ డిడి ఎస్.రామ్మోహన్, మైక్రో ఇరిగేషన్ పీడీ పి.రవికుమార్, జిల్లా పరిశ్రమల శాఖాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, పశుసంవర్ధక శాఖ జెడి గోవిందరాజులు, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థ జోనల్ మేనేజర్ మారుతి, సాయి శ్రీనివాస్, ఆయిల్‌పామ్‌కు సంబంధించి గోద్రెజ్, నవభారత్, త్రిబుల్ ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థల ప్రతినిధులు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతోపాటు ఉద్యాన శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొల్లేరులో సిపిఎం బృందం పర్యటన

విచ్చేయనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, బి.బలరాం

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు ప్రజల సమస్యలపై ఈ నెల 26వ తేదీ శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కొల్లేరు ప్రాంతంలో పర్యటించనున్నా రని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పర్యట నలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయ కులు మంతెన సీతారాం, రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 26న ఉదయం తొమ్మిది గంటలకు గుడివాకలంకలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారని, అనంతరం పది గంటలకు పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు పరిశీలన, 11 గంటలకు కొవ్వాడలంకలో కొల్లేరు ప్రజలతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. కొల్లేరును ఐదో కాంటూరు నుండి మూడో కాంటూరుకు కుదించడం ద్వారా కొల్లేరు ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అందుకు సిపిఎం కృషి చేస్తుందని వివరించారు. ఇటీవల కొల్లేరు ప్రజల సమస్యలపై సిపిఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించిందని గుర్తు చేశారు. సిపిఎం బృంద పర్యటనలో కొల్లేరు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేలా ప్రణాళిక

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు - జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రానున్న వర్షాకాలంలో సంభవించే ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొనేలా సంబంధిత శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమి సమావేశపు హాలులో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో రానున్న వర్షాకాలంలో వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన సన్నద్ధత చర్యలపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వర్షాకాల సమయంలో గోదావరి తీర ప్రాంతంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ఆ ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. వర్షాల కారణంగా కూలిపోయే స్థితిలో భవనాలు, వంతెనలు, కల్వర్టులు, కాజ్‌వేలను గుర్తించి, ముందుగానే మరమ్మతులు చేయించాలన్నారు. వర్షాకాల సమయంలో వాటి కారణంగా ఎటువంటి ప్రమాదాలూ వాటిల్లకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదులు, కాల్వలు, చెరువు గట్లను పరిశీలించి బలహీనమైన చోట్ల పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వరదల సమయంలో గండ్లు పడిన ప్రదేశాలను పరిశీలించి, అవసరమైన చోట పటిష్టం చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూలిపోయిన చెట్లను తొలగించేందుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని ఆర్అండ్‌బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకూడదు

వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి

వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కాల్వలు కట్టేలోగా జిల్లాలోని తాగునీటి చెరువులన్నింటినీ నింపుకోవాలన్నారు. శివారు ప్రాంతాలకుసైతం నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులకు గురైన బోర్లను వెంటనే మరమ్మతులు చేయించాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ భీమేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ కె.విజయరాజు, డిఎంహెచ్‌ఒ డాక్టర్ మాలిని, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్, డిపిఒ కె.అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ త్రినాథ్‌బాబు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్, డిటిసి కరీం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

తాగునీరు, విద్యుత్ కోసం ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

అల్లూరి సీతా రామరాజు నగర్ కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని ఆ గ్రామానికి చెందిన గిరిజనులు సిపిఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా కాలనీలో మౌలిక సదుపాయాలు లేక గ్రామస్తులు నానావస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇక్కడ నివాసం ఉండేవారంతా గిరిజనులు, దళితులు కావడంతో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సౌకర్యాలను కూటమి ప్రభుత్వం కల్పించి గ్రామస్తులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గిరిజనులు మడకం కుమారి, బరగడ కుమారి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గిరిజనులు

ఉగ్రదాడిని ఖండిస్తూ కొనసాగిన నిరసనలు

ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడుల్లో చనిపోయిన వారికి నివాళులర్పిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సిపిఎం కార్యాలయం నుండి ప్రదర్శనగా బయల్దేరి వసంతమహల్ సెంటర్‌కు చేరుకుని అక్కడ కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రదాడిని యావత్ సమాజం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.నరసింహారావు, కె.రామాంజనేయులు, వివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు, ఎ.శ్యామలారాణి, కె.విజయలక్ష్మి, ఎస్ఎన్.రమేష్, ఎం.ఇస్సాక్, బి.సోమయ్య, పి.రవికుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద

కాశ్మీర్లో ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఏలూరు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఏలూరు జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కోఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనివాస్ మోహన్, కాళే శ్రీనివాసరావు మాట్లా డారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, బ్యాం కు ఉద్యోగులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: కాశ్మీర్ ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం ముదినేపల్లి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు షేక్ బాజీ, మహ్మద్ షరీఫ్, షేక్ నూరుల్లా, ఇమ్రాన్, సులేమాన్, మహ్మద్ రియాజ్ పాల్గొన్నారు.

ఏలూరు సిటీ: ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ జనసేన ఆధ్వర్యాన పాత బస్టాండ్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, జిల్లా కార్యదర్శి కస్తూరి తేజస్విని, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పోలవరం: కాశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ కూటమి నేతలు స్థానిక ఏటిగట్టు సెంటర్లో మానవహారం నిర్వహించారు.

గూటాల అల్ రెహ్మాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లిములు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. గూటాల మసీదు కమిటీ పెద్దలు షేక్ బషీర్, మదీనా, పీర్ భాషా, బాజీ, ఇమ్రాన్, షాజహాన్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, అల్తాఫ్, ఖలీల్. కూటమి నాయకులు బొడ్డు కృష్ణ, మంగిన కొండ, జల్లేపల్లి వెంకటనరసింహారావు, కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని, తెలగంశెట్టి రాంప్రసాద్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పట్టణంలోని పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ మాట్లాడారు. నేతలు ఇంటూరి చంటి, ముత్యాల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ప్రధాన సెంటర్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మానవహారం నిర్వహించారు.

చింతలపూడిలో...

చింతలపూడి: కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ స్థానిక బోసుబొమ్మ సెంటర్లో సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ, మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరావు, యుటిఎఫ్ నాయకులు దామోదర్, ప్రేమ్, బుచ్చిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సరుకు రవాణా వాహనదారులకు బిల్లులు తప్పనిసరి

కమర్షియల్ ట్యాక్స్ అధికారి వైవి.కృష్ణవేణి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జాతీయ రహదారి గుండా సరుకు రవాణా చేసే వాహనదారులు తప్పనిసరిగా బిల్లులు కలిగి ఉండాలని కమర్షియల్ ట్యాక్స్ అధికారి వైవి.కృష్ణవేణి తెలిపారు. వారాంతపు తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ జాతీయ రహదారి గుండా సరుకు రవాణా చేసే వాహనదారులు తప్పనిసరిగా బిల్లులు కలిగి ఉండాలని తెలిపారు. 50 వేలు దాటితే బిల్లు, వేబిల్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు రూ.30 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది జి.రాజు, జగన్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు చేస్తున్న సిబ్బంది

27 నుంచి కాలువలు మూసివేత

కాలువల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం - ఇరిగేషన్ ఎస్ఇ నాగార్జునరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల 27వ తేదీ నుంచి కాలువలు మూసి వేయనున్నట్లు ఏలూరు ఇరిగేషన్ శాఖ ఎస్ఇ నాగార్జునరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో డెల్టా ప్రాజెక్టు కమిటీ కె.ఛైర్మన్ మురళీకృష్ణంరాజు అధ్యక్షతన ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖ అధికారులు, నీటి సంఘం నాయకులతో ప్రాజెక్ట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న కాలువలు మూసివేయాల్సి ఉండగా, దాన్ని ఈనెల 27వ తేదీ వరకూ పొడిగించినట్లు తెలిపారు. కాలువలు, డ్రెయినేజీల ప్రక్షాళనకు ప్రతి నియోజకవర్గానికి రూ.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కాలువలో గుర్రపుడెక్క, తూడు వంటి వాటిని తొలగించడంతోపాటు, గట్ల పటిష్ట పనులు చేపడతామన్నారు. ఈ పనులు ఆ కాలువ పరిధిలోని నీటి సంఘం ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. అలాగే కాల్వ వల్లపై పనిచేసే లస్కర్లకు ప్రభుత్వం ఏడాదికి పది నెలలే జీతాలు చెల్లిస్తుందని, అయితే ఈ ఏడాది నుంచి తమకు 12 నెలలు జీతాలు చెల్లించాలని లస్కర్లు కోరినట్లు, దానిపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ఇఇ సుబ్రహ్మణ్యేశ్వరరావు, భీమవరం డ్రెయినేజీ సిహెచ్ వివి.సత్యనారాయణమూర్తి, ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ జి.మాత్రరాజు, ఇరిగేషన్ డిఇలు డ్రెయినేజీలు డిఇలు, ఎఇ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఇ నాగార్జునరావు

రఘురామా.. ఇదేం భాష.. అదేం తీరు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై ఉండి ఎంఎల్ఎ వ్యాఖ్యలను ఖండిస్తూ 'పశ్చిమ'లో నిరసనల వెల్లువ

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిరసనలు వెల్లువెత్తాయి. రఘురామకృష్ణరాజు తీరు మార్చుకోవాలని, పేదలకు న్యాయం చేయాలని నినదించారు. కమ్యునిస్టులను బెదిరిస్తే బెదిరిపోయే రకం కాదని స్పష్టం చేశారు.

ఆకివీడులో నిరసన

జాతీయ లోక్‌అదాలత్ జులై 5కి వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మే పదో తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ జులై ఐదో తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లావ్యాప్తంగా రెండో జాతీయ లోక్‌అదాలత్ జులై ఐదో తేదీకి మార్చినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

రోడ్డు ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

కొత్తపల్లి సెంటర్‌లో ఆర్అండ్‌బి రోడ్డును ఆక్రమించుకుని పక్కా నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్న ఆక్రమణదారులకు గ్రామపంచాయతీ శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ఆక్రమణలకు అడ్డాగా కొత్తపల్లి సెంటర్ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.సునీల్‌కుమార్, విఆర్ఒ కె.సుధీర్ తెలిపారు. రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే గ్రామపంచాయతీ కార్మికులతో తొలగించి అందుకు అయ్యే ఖర్చులను ఆక్రమణదారుల నుంచి వసూలు చేస్తామని తెలిపారు. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధి గొల్లపల్లి గ్రామంలోని శ్రీ అన్నేరామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆరో తరగతి ప్రవేశాల కోసం గత రెండు రోజుల నుంచి క్యాంపెయిన్ నిర్వహించి ఇంటింటా ప్రచారం చేస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధికారాణి తెలిపారు. గొల్లపల్లి, మెర్సపూడి, పోలసానిపల్లిలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేరడం వల్ల యూనిఫామ్, షూస్, సాక్స్, నోట్ బుక్స్, బ్యాగ్, బెల్ట్, డిక్షనరీ, టెక్స్ట్ బుక్స్, నాణ్యమైన ఆహారం, విద్య, రాగిజావ, గుడ్డు అందించనున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాల టాపర్‌గా జ్యోతిశ్రీదుర్గ

ప్రజాశక్తి - ఉంగుటూరు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బొమ్మిడి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని పుల్లంకి జ్యోతిశ్రీదుర్గ 561 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చింది. ఈ పాఠశాలలో 118 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 59 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయులు వెల్లడించారు. స్కూల్ ఫస్ట్ వచ్చిన జ్యోతిశ్రీదుర్గను సిబిటియు మండల కార్యదర్శి సీరా అప్పారావు అభినందించారు.

జ్యోతి శ్రీదుర్గ

పూజితను అభినందిస్తున్న సిఐ, ఎస్ఐ, ఎంఇఒ

పది ఫలితాల్లో పూజిత ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి సుబ్బరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కానూరు పూజిత పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 585 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. పూజితను ఆమె ఇంటి వద్ద చింతలపూడి సిఐ సిహెచ్.రాజశేఖర్, ఎంఇఒ కిరణ్‌బాబు, ఎస్ఐ కుటుంబరావు ప్రత్యేకంగా అభినందించారు. చదువులో ఆమె చూపిన శ్రద్ధ, పట్టుదల అభినందనీయమని వారు కొనియాడారు. పాఠశాల అధ్యాపక బృందం కూడా పూజితను అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పూజిత సాధించిన ఈ ఘనవిజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని వారు తెలిపారు. ఆమె తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని పూజిత తెలిపింది. తన భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతానని తెలిపింది.

నేరాలు - ఘోరాలు

నెల రోజుల్లో పెళ్లి.. యువకుడు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నెల రోజుల్లో ఆ యువకుడి పెళ్లి... అతను పెళ్లి పనుల్లోనూ... తన పనుల్లోనూ నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ఆ యువకుడు బైక్‌పై వెళ్తుండగా మృత్యువు కబళించింది. యువకుడి మృతి రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తంగెళ్లమూడి సెక్రటేరియట్ పరిధిలోని రాజీవ్‌గాంధీ ప్రాంతానికి చెందిన సిర సాయికుమార్ (27) స్థానికంగా కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఇతనికి వచ్చే నెలలో వివాహం నిశ్చయమైంది. ఇప్పటికే వీరి ప్రధాన కార్యక్రమం కూడా ముగిసింది. ఒకవైపు పెళ్లి పనుల్లోనూ మరోవైపు అతని పనుల్లోనూ నిమగ్నమైన అతను శుక్రవారం సాయంత్రం బైక్‌పై ఇంటి వద్ద నుంచి తంగెళ్లమూడి బయలుదేరాడు. మసీదు ప్రాంతానికి చేరుకునేసరికి బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నెల రోజుల్లో పెళ్లి కావాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె ఇళ్లల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.


సాయికుమార్ (ఫైల్)

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి

ప్రజాశక్తి - ముసునూరు

వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన గోగులంపాడులో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన విమల శివయ్య (35) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ భార్య పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అదే గ్రామానికి చెందిన పాలడుగు నాగేంద్రబాబుకు చెందిన పామాయిల్ తోటలో పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లాడు. ఐరన్ పైపుతో పామాయిల్ గెలలు కోస్తుండగా 11 కెవి విద్యుత్ లైన్‌కు ఆ పైపు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే అతని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శివయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కోతుల దాడిలో విద్యార్థికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న విద్యార్థిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కె.హర్షసాయి పాఠశాలలకు సెలవులు కావడంతో తోటి విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో క్రికెట్ ఆడుతున్నాడు. ఈ క్రమంలో బంతి పక్కన వెళ్లడంతో తీసుకొచ్చేందుకు వెళ్లిన హర్షసాయిపై కోతులు దాడి చేశాయి. ఈ దాడిలో హర్షసాయికి తీవ్ర గాయాలు కావడంతో జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడినుంచి జంగారెడ్డిగూడెంలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. సెంటర్‌లో గత కొంతకాలంగా కోతుల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటిని అరికట్టకపోవడంతో ఇలా దాడులకు ఎగబడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని సుంకొల్లు గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో కొనకాల నాంచర రమణ అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. ఆమెకు సారా సరఫరా చేస్తున్న సుంకొల్లు గ్రామానికి చెందిన పామర్తి రమాదేవిపైన కూడా కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు.

చింతలపూడి : మండలంలోని నాగిరెడ్డిగూడెంలో నాటుసారా స్థావరంపై దాడి చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. గ్రామంలో విఆర్ఒ, గ్రామ మహిళా పోలీస్ సిబ్బంది సమాచారంతో ప్రభావతి లక్ష్మి అనే మహిళ ప్రాంగణంలో ఆమె ఇంట్లో నాటు సారా ఉన్న 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వంద లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నీటి ప్రవాహానికి అడ్డంకిగా డెక్క

తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు

తొలగించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

తాగునీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డంకిగా మారింది. ఈ పరిస్థితి ముదినేపల్లి పోల్‌రాజ్ కెనాల్ వద్ద నెలకొంది. నియోజవర్గంలోని గ్రామాల ప్రజల తాగునీటి అవసరాల కోసం అధికారులు వారం రోజుల క్రితం పోల్‌రాజ్ కెనాల్‌కు గుడ్లవల్లేరు లాకుల నుంచి తాగునీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నీరు కాలువలో ఉధృతంగా ప్రవహిస్తుంది. అయితే నీటితో పాటు ఎగువ నుంచి గుర్రపు డెక్క కూడా కాలువలో భారీగా కొట్టుకు వస్తుంది. ఈ గుర్రపు డెక్క పలు చోట్ల కాలిబాట వంతెన కానాలకు పట్టి వేస్తుంది. ఈ కారణంగా కాలిబాట వంతెన కానాల వద్ద దట్టంగా డెక్క పేరుకుపోతుంది. దీంతో కాలువ శివారు గ్రామాలకు తాగునీరు సక్రమంగా పారే అవకాశం లేకుండా పోయింది. ముదినేపల్లి వద్ద కాలిబాట వంతెన కానాలకు భారీగా గుర్రపు డెక్క పట్టివేసింది. దీంతో తాగునీరు కాలువ శివారు గ్రామాల నీటి పారుదలకు అడ్డంకిగా మారింది. అధికారులు వెంటనే స్పందించి కాలువ ఆయకట్టు పరిధిలో పలు గ్రామాల్లో కాలిబాట వంతెనల వద్ద కానాలకు పట్టివేసిన గుర్రపు డెక్కను తొలగించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముదినేపల్లిలో కాలిబాట వద్ద దట్టంగా పేరుకుపోయిన డెక్క

మలేరియా నిర్మూలన సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మలేరియా అంతం మనతోనే ప్రారంభం అవ్వాలని, ఆ వ్యాధి నిర్మూలన ప్రజలు సామాజిక బాధ్యతగా భావించినప్పుడే మలేరియా రహిత సమాజాన్ని స్థాపించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే మలేరియా కావచ్చని చెప్పారు. మలేరియా జ్వరం రోజు విడిచి రోజు వస్తుందన్నారు. మలేరియా జ్వరాన్ని అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని, తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. హెచ్‌డబ్ల్యూసి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామినేని రోహిత్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నిర్మూలించుకోవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ డ్రై డే ఆచరించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు, ఉచిత మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, డెమో నాగరత్నం, డిపిహెచ్ఎన్ఒ జ్యోతి, డిఎంహెచ్ఒ సిసి బసవరాజు, ఎంపిహెచ్ఇఒ రవికుమార్, మలేరియా హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, పెద్ద సంఖ్యలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ర్యాలీ ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ మాలిని

కొయ్యలగూడెం : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బయ్యన్నగూడెం పిహెచ్‌సి సిబ్బంది బయ్యన్నగూడెంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ మలేరియా వ్యాధిని సకాలంలో గుర్తించి వైద్యం అందించకపోతే చాలా ప్రమాదకరమన్నారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎం.గీతారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం :మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.ఆంజనేయులు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ హెచ్‌వి సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :పట్టణంలోని కోనేరుపేటలో ఉన్న యుపిహెచ్‌సి ఆధ్వర్యంలో మలేరియా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.ఎలమంద మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. మలేరియాకు పూర్తి చికిత్స ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టి.కుమారి, రవీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంచగల వెంకట లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆయన చికిత్స కోసం ఆర్థిక సహాయం కోసం కుటుంబసభ్యులు మంత్రి కొలుసు పార్థసారధి దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం చికిత్స నిమిత్తం సిఎం సహాయ నిధి నుంచి రూ.4.5 లక్షల ఎల్ఒసి మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

కస్తూర రంగన్ మృతికి సంతాపం

భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో కస్తూరి రంగన్ విశేష సేవలందించారని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్, పద్మవిభూషణ్ డాక్టర్ కృష్ణస్వామికస్తూరి రంగన్ మృతిపట్ల ఆయన సంతాపం తెలిపారు. కస్తూరి రంగన్ దేశానికి సాంకేతికపరంగా, కమ్యూనికేషన్ రంగాల్లో ఎనలేని సేవలందించారని కొనియాడారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

మహిళలు, బాలికలు తమ రక్షణ కోసం అందుబాటులో ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చింతలపూడి సిఐ సిహెచ్.రాజశేఖర్ సూచించారు. పట్టణంలో మహిళా భద్రత, సమాజ పరిరక్షణపై మహిళా పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు కలిసి ఆడ పిల్లల రక్షణ – సమాజ పరిరక్షణ నినాదంతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళా భద్రతకు సంబంధించిన పలు అంశాలపై నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ టోల్ ఫ్రీ నెంబర్లు 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ మోసాల నివేదికల కోసం), 1098 (బాలల హెల్ప్‌లైన్), 181 (మహిళల హెల్ప్‌లైన్), 1073 (ట్రాఫిక్ సమాచారం కోసం), 101 (ఫైర్ ఎమర్జెన్సీ) ప్రాముఖ్యతను వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ కుటుంబరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగడం ద్వారా సమాజంలో శాంతిభద్రతలు నెలకొంటాయన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అన్నదాతకు దన్నుగా నిలిచే దిశగా ముందుకు వెళ్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి వ్యవసాయ మార్కెట్ వద్ద ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందించే ట్రాక్టర్లు, పరికరాలు, జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలు రైతులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కె.హబీబ్ భాషా, చింతలపూడి వ్యవసాయ సంచాలకులు నాగ కుమార్, అగ్రికల్చర్ ఎఒ మీనాకుమారి, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హెచ్ఎం వి.సాయిలక్ష్మి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాటాడ సాయిలక్ష్మి(54) మృతి చెందారు. సాయిలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మరణించారు. ఆమె భర్త ప్రసాద్ మండలంలోని బొమ్మినంపాడు హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. హెచ్ఎం సాయిలక్ష్మి మృతి పట్ల ఎంఇఒ కె.నరేష్‌కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, అల్లూరు గ్రామస్తులు తమ సంతాపం తెలిపారు.

భాష్యం స్కూల్ ప్రభంజనం

పది ఫలితాల్లో విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో చింతలపూడి భాష్యం స్కూల్ ప్రభంజనం సృష్టించిందని ప్రధానోపాధ్యాయులు కంచర్ల సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భాష్యం విద్యార్థులు పి.హరితేజ 593 మార్కులతో స్కూల్ ప్రథమ స్థానంలో, వై.హన్సికసాయి 583 మార్కులతో ద్వితీయ స్థానంలో ఎస్‌డి.అబ్దుల్ ఆహిల్ 582 తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. 550 మార్కులకు పైగా 11 మంది, 500 మార్కులకు పైగా 20 మంది సాధించా రన్నారు. నూరు శాతం ప్రథమ శ్రేణి ఉత్తీర్ణతను సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.


హరితేజ

శ్రీ సాయి ప్రణీత హైస్కూల్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణ పరిధిలోని శ్రీ సాయి ప్రణీత హై స్కూలు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ కరస్పాండెంట్ కానూరి అనురాధ, సాయి ఫణీంద్ర తెలిపారు. పాఠశాలలో వారు శుక్రవారం మాట్లాడుతూ శ్రీ సాయి ప్రణీత హైస్కూల్ 11 ఏళ్లుగా నూజివీడు పరిసర ప్రాంత విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన అత్యుత్తమ విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఎం.గాయత్రి 586 మార్కులతో పాఠశాల ప్రథమ, వి.లీపిక 580 మార్కులతో ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. 500 మార్కులు దాటిన వారు 18 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తంగా 36 మందికి 36 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తామన్నారు. నూజివీడు–విజయవాడ ప్రధాన రహదారిలో సువిశాలమైన ప్రాంగణంలో పచ్చని చెట్ల మధ్య ప్రకృతి ఒడిలో నేటి సాంకేతిక నైపుణ్యాలను అందిస్తూ విద్యాబోధన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విద్యను బెత్తంతో కాకుండా భవితకు బంగారు బాటలు వేసే రీతిగా అందిస్తున్నామన్నారు. ఇందుకోసం తమ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అవిశ్రాంతమైన కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


గాయత్రి

సాగు నమోదు చేయాలని వినతి

పోలవరం :ఏజెన్సీ ప్రాంతంలో గత 35 ఏళ్లుగా సాగు చేస్తున్న భూముల్లో గిరిజనులకు సాగు నమోదు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ కోరారు. మండలంలోని నాగంపాలెం శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో పాల్గొన్న జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు సాగుచేస్తున్న ఎల్‌టిఆర్, 1/0 చట్టభూములకు 1 బి అడంగల్‌లో నమోదు చేయాలని కోరారు. సాగు దారులందరికీ హక్కు పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. గిరిజనులు భూముల్లో సాగు చేస్తున్న రికార్డుల్లో గిరిజనేతరుల పేర్లను నమోదు చేయడం సరికాదన్నారు. ఎల్‌టిఆర్, 1/70చట్ట ప్రకారం భూములు సాగు చేస్తున్న గిరిజనుల పేర్లను నమోదు చేయాలన్నారు. ఆర్‌డిఒ ఎంవి.రమణ మాట్లాడుతూ రీ సర్వేలో సాగుదార్ల పేర్లు నమోదు చేస్తామని తెలిపారు. వినతిపత్రం అందించినవారిలో సిపిఎం నాయకులు మడివి చలపతి, మిడియం పండుదొర, కాకి బాలరాజు, జయలక్ష్మి, శ్రీను ఉన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

శిశు గృహాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ శిశు గృహాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. స్థానిక విద్యానగర్‌లోని ప్రభుత్వ శిశు గృహాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలచే నిర్వహిస్తున్న శిశు గృహాలను తనిఖీలు చేసి నివేదికలు పంపించాల్సి ఉందని, అందులో భాగంగా శిశు గృహాన్ని సందర్శించామని తెలిపారు. బాలలకు అందుతున్న ఆహార, వైద్య సదుపాయా లపైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరి శుభ్రంగా ఉంచాలని, పౌష్టికాహారాన్ని అందించాలని, పిల్లల సంరక్షణలో ఎదురయ్యే న్యాయ సమస్యలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారాన్ని అందిస్తుందని సూచించారు.

తనిఖీ చేస్తున్న రత్నప్రసాద్

నేడు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ

ఉంగుటూరు :వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కలెక్టర్ వెట్రిసెల్వి ఈ నెల 26వ తేదీన నారాయణపురంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంఎల్ఎ ధర్మరాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడు తూ ప్రభుత్వం రాయితీపై అందించే పవర్ టిల్లర్లు, స్ప్రేయర్ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు మంజూరయ్యాయని తెలిపారు. మండలంలో పవర్ టిల్లర్లు 48, బ్యాటరీ స్ప్రేయర్లు నాలుగు, పవర్ స్ప్రేయర్లు నాలుగు, కల్టివేటర్లు ఐదు మొత్తం 63 యూనిట్లకు రూ.50.17 లక్షల రాయితీపై ఇవ్వనున్నారని తెలిపారు. భీమడోలు మండలంలో బ్యాటరీ స్ప్రేయర్లు 12, పవర్ స్ప్రేయర్లు ఏడు, కల్టివేటర్లు ఆరు, పవర్ టిల్లర్లు పది మొత్తం 36 యూనిట్లకు రూ.12.15 లక్షల రాయితీ, నిడమర్రు మండలంలో పవర్ టిల్లర్లు 15, కల్టివేటర్ ఒకటి మొత్తం 16 యూనిట్లకు రూ.15.21 లక్షల రాయితీపై యాంత్రీకరణ పరికరాలను అందిస్తున్నామని తెలిపారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

ఏలూరు అర్బన్ :2025–26 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు రెసిడెన్షియల్ స్కూల్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్, రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో, రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఎపిఆర్‌జెసి అండ్ డిసి సెట్ శుక్రవారం ఏలూరులోని ఆరు పరీక్షా కేంద్రాల్లో జరిగాయి. ఈ పరీక్షల్లో ఎపి ఆర్ఎస్ క్యాట్ 2025 పరీక్షకు 1237 మందికి 987 మంది హాజరు కాగా 250 మంది గైర్హాజరయ్యారు. ఎపిఆర్‌జెసి పరీక్షకు 1520 మందికి 1305 మంది హాజరు కాగా 215 మంది గైర్హాజరయ్యారు. డిసి సెట్ పరీక్షకు 44 మందికి 38 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

భీమవరం పురపాలక సంఘం
ఆర్.ఓ.సి. నెం. 12(1744533)/2019/డి.బి
దీ.24-04-2025
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు
భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో షార్టు టెండరు నోటీసు నెం.03(1) /BHI/BPS/LRS//2025-26/E1 & షార్ట్ టెండరు నోటీసు నెం.03 (2-6) BHI/General/2025-26/E1 లోని జనరల్ నిధుల నుండి 5 పనులకు గాను రూ. 134.40 లక్షలు, మరియు BPS LRS నిధుల నుండి 1 పనికి గాను రూ. 5.00 లక్షలతో, ఇ-ప్రొక్యురుమెంటు ద్వారా టెండర్లు జి.వో.ఎమ్.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యురుమెంటు మార్కెట్టు www.tender.apeprocurement.gov.in లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘము, ప.గో.జిల్లా (సెల్: 9849906540, 9849906543 వారిని సంప్రదించగలరు.
కమీషనరు,
భీమవరం పురపాలక సంఘం

కార్యకర్తలకు అండగా ఉంటాం : మంత్రి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టిడిపి కార్యకర్తల పూర్తి కుటుంబ బాధ్యత, ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. కార్యకర్త సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. మండలంలోని మొర్సపూడి గ్రామంలో ఇటీవల ప్రమాదంలో మరణించిన కె.మరియమ్మ కుటుంబ సభ్యులను గురువారం రాత్రి ఆయన పరామ ర్శించి రూ.ఐదు లక్షల చెక్కును అందించారు.

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కూటమి ప్రభుత్వం స్పౌజ్ కేటగిరి కింద మంజూరు చేసే పింఛన్లకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులు మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు తన ఆధార్ కార్డు వివరాలను సమీపంలోని గ్రామ వార్డు సచివాలయంలో అందించాలని తెలిపారు. ఈ నెల 25 నుంచి 30 లోపు వివరాలతో కూడిన దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. గడువులోగా నమోదు చేసుకోలేని వారికి జూన్ 1 నుంచి చెల్లిస్తారని ఎంపీ తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని గ్రామ వార్డు సచివాలయంలో సంప్రదించాలని తెలిపారు.

ఉగ్రదాడిపై నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిపై నిరసనగా మండలంలోని బర్రింకలపాడు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం ఎదుట, జీలుగుమిల్లి ప్రధాన రహదారిపై జనసేన పార్టీ నాయకులు శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఉగ్ర దాడిలో చనిపోయిన కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ పసుపులేటి రాము, కూటమి నాయకులు సూరిబాబు, కిషోర్, శ్రీను, మధు, రాము, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిపై విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి కొండేటి బాబీ, కాట్రేనిపాడు గ్రామ సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు, సాంబయ్య, కాంతారావు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బోరవంచ గ్రామానికి చెందిన మంచోడు మణిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

చాట్రాయి : మంత్రి కొలుసు పార్థసారధిపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నేతలు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నరసింహారావుపాలెం మాజీ సర్పంచి, టిడిపి దళిత నాయకుడు గార్లపాటి మారేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి గ్రామ మాజీ సర్పంచి కోటా జోషి, చిన్నంపేట గ్రామ మాజీ ఎంపిటిసి సభ్యులు కలపాల రమేష్, టిడిపి దళిత నాయకులు కొమ్ము సుజాన్‌రావు, మోదుగు ముత్తయ్య, రమేష్, కారుమంచి దావీదు, ములుగుమటి రవిరామ్ పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, BOKKA SRINIVAS, S/o Bokka Satyanarayana, D.No.216, gandhidham, kutch Dt, guajrat.
I changed my name from BOKHA SRINIVAS SATYANARAYANA (Old Name) to BOKKA SRINIVAS (New Name). Hence forth i am being called BOKKA SRINIVAS S/o Bokka Satyanarayana
for all purposes

CHANGE OF NAME
I, BOKKA DURGA DEVI, W/o Bokka Srinivas, D.No.6-126, Mandapaka, Tanuku, W.G.Dt. A.P.
I changed my name from BOKHA DURGA DEVI SRINIVAS (Old Name) to BOKKA DURGA DEVI (New Name). Hence forth i am being called BOKKA DURGA DEVI W/o Bokka Srinivas
for all purposes

పాస్‌పోర్ట్ పోయినది
పశ్చిమగోదావరి జిల్లా, ఇరగవరం మండలం, సూరంపూడి గ్రామానికి చెందిన బొల్లా సత్యవాణి అను నా యొక్క పాస్‌పోర్టు నెంబర్: S1587399 గల పాస్‌పోర్టు తణుకు నుండి సూరంపూడి వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయింది. చుట్టు ప్రక్కల ఎంత వెతికినను దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.
బొల్లా సత్యవాణి
D/o. వీరాస్వామి
డోరు నెం. 2-30, సూరంపూడి
ఇరగవరం మండలం, ప.గో. జిల్లా,
సెల్ నెం: 87907 51712